క్లుప్తంగా

విధుల్లో అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న తహశీల్దార్ గణపతిరావు

శ్రీకాకుళం రూరల్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.గణపతిరావు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఇటీవల నదుల్లో వరద నీరు ఎక్కువగా వస్తున్నందున పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వరదనీరు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా, పెండింగ్‌లో ఉన్న నీటి పన్ను వెంటనే వసూలు చేయాలని సూచించారు. సమావేశంలోపలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



పామును పట్టుకున్న కిరణ్‌బాబు

జి.సిగడాం: చెట్టుపొదిలాం గ్రామంలో మేటికోటి ఈశ్వరరావు ఇంట్లోకి శుక్రవారం నాగుపాము చొరబడింది. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన డోల కిరణ్‌బాబు నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం ఊరికి దూరంగా ఉన్న చెరువు వద్ద విడిచిపెట్టారు.

మాజీ మంత్రి ధర్మాన పరామర్శ



జ్యోతిప్రసాద్ కుటుంబ సభ్యుల్ని పరామర్శిస్తున్న ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కళ్యాణి జ్యోతిప్రసాద్ ఇటీవల మృతి చెందడంతో రెల్లివీధిలో గల ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం పరామర్శించారు. జ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, మాజీ కౌన్సిలర్లు భైరి మురళి, ఆబోతుల రామ్మోహన్‌రావు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో జ్యేష్ఠ శుద్ధ చవితి సందర్భంగా శుక్రవారం గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో మూల మంత్ర సహిత గణపతి హవనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాడు ఆదర్శం.. నేడు అస్తవ్యస్తం



నాడు-నేడుతో సుందరంగా తయారైన పాతర్లపల్లి పాఠశాల

- నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చిన జగనన్న సర్కారు
- బిల్లులు చెల్లించకుండా అసంపూర్తిగా వదిలేసిన కూటమి ప్రభుత్వం
- సంస్కరణల పేరిట విద్యారంగం నిర్వీర్యం
- అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అందకపోవడంపై మండిపాటు



చిలకపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నాడు-నేడు పాఠశాల పనులు

సమాజం నుంచి పేదరికాన్ని శాశ్వతంగా తరమాలంటే విద్య ఒక్కటే పరిష్కారం అన్న లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసింది. ఐదేళ్ల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా నాడు-నేడు పేరిట పాఠశాలల రూపురేఖలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మార్చారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను పక్కాగా అమలు చేశారు. ఇంతలో బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా మార్చేసింది. తల్లికి వందనం, ఫీజు బకాయిలు చెల్లించకుండా చేతులెత్తేసింది. సంస్కరణల పేరిట రోజుకో నిర్ణయం ప్రకటిస్తూ ఉపాధ్యాయవర్గాలను ముప్పుతిప్పలు పెడుతోంది.



గార మండలంలో..	
ప్రభుత్వ పాఠశాలలు:	98
పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు:	6738
తొలివిడత నాడు-నేడు జరిగిన పాఠశాలలు:	28
తొలివిడత వ్యయం:	రూ.8.23 కోట్లు
రెండవ విడత నాడు-నేడు జరిగిన పాఠశాలలు:	రూ.53
రెండవ విడత వ్యయం:	రూ. 15.16 కోట్లు

ఎచ్చెర్ల క్యాంపస్/గార:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలలను ఎంతగానో బలోపేతం చేసింది. నాడు-నేడు పథకంలో పాఠశాలల స్వరూపాన్ని సమూలంగా మార్చింది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించింది. తరగతి గదులు, ప్రహరీ, ఫర్నిచర్, ఇలా ప్రతి అంశంలో మార్పుతీసుకొచ్చింది. విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందించింది. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, బైజూస్ కంటెంట్, డిజటల్ విద్య అమలు చేసింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. గత ప్రభుత్వంలో మొదలైన నాడు-నేడు పనులను ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారు 50 పాఠశాలల్లో అసంపూర్తిగా వదిలేశారు. ఈ నిర్మాణాలు పూర్తికాక పాడవుతున్నాయి. గోరుముద్దలో నాణ్యత తగ్గింది. పాఠశాలలు మెర్జ్ చేస్తుండటంతో ఏ ఊరిలో బడి ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అమ్మఒడి స్థానంలో తీసుకు వస్తామన్న తల్లికి వందనం ఇంకా అమలు చేయలేదు. మొత్తమ్మీద పాఠశాల నిర్వహణ గాడి తప్పింది. గార మండలంలో 98 పాఠశాలకు గాను తొలి విడతగా 28 పాఠశాలలు ఎంపిక చేసి భవనాలు మొదలుకొని ప్రహరీల వరకు సుందరంగా తీర్చిదిద్దారు. రెండో విడతగా 53 పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిపేశారు. పాఠశాలల క్రమబద్ధీకరణ పేరిట పలు స్కూళ్లను మూసేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో మేధావులు ప్రభుత్వ విధానాలపై మండిపడుతున్నారు.



డిజిటల్ బోర్డుపై పాఠాలు చెబుతున్న టీచర్

ఉన్నత విద్యలోనూ..

ఎచ్చెర్ల నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. జిల్లాలో ప్రాధాన్యత గల ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర విశ్వవిద్యాలయం, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ), సంతసీతారాంపురంలో సైన్క ప్రైవేట్ వ్యవసాయ కళాశాల, ఎచ్చెర్లలో శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్, చిలకపాలేంలో శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్, రెండు పార్మశీ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, మూడు డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఐటీఐ, 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 393 పాఠశాలలు ఉన్నాయి. సుమారు 15000 మంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు.



గత ప్రభుత్వ హయాంలో కె.మత్స్యలేశం కళాశాలలో రూ.4కోట్లతో నిర్మించిన నూతన భవన సముదాయం

తల్లికి వందనం ఎప్పుడిస్తారో?



సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకం కోసం ఎంతోమంది అర్హులు ఎదురు చూస్తున్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికీ రూ.15000 చొప్పున అందజేస్తామన్నారు. 2024-25 విద్యా సంవత్సరం పూర్తయ్యింది. పథకం మాత్రం అమలు చేయలేదు. ఒక్కో విద్యార్థికి బకాయి కలిపి రూ.30 వేలు అందజేయాల్సి ఉంది.

– జ్యోతి, చిలకపాలెం, ఎచ్చెర్ల మండలం

రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి..



ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అనేక మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు రిలీవ్ అవుతున్నారు. అయినా పూర్తిగా ఫీజు స్ట్రక్చర్ విడుదల చేయలేదు. కొన్నిచోట్ల కళాశాలలు ఫీజు కోసం ఒత్తిడి తెస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి.

– అక్షిత, ఇంజినీరింగ్ విద్యార్థిని, ఎచ్చెర్ల

గతంలో విద్యా దీవెన, వసతి దీవెన ఠంచన్‌గా అమలయ్యేది. కూటమి సర్కారు వచ్చాక 2024-25 విద్యా సంవత్సరం పూర్తయినా వాటికి అతీగతి లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నాలుగు విడతలుగా విభజించి ఒక్క విడత మాత్రమే విడుదల చేశారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో..	
మండలాలు:	ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం
ప్రభుత్వ పాఠశాలలు:	363
నాడు-నేడు పథకం అమలు చేసిన పాఠశాలలు:	252
నాడు-నేడులో చేసిన ఖర్చు:	రూ.84.08 కోట్లు
నియోజకవర్గంలో ఉపాధ్యాయులు:	1601
2023-24 విద్యాసంవత్సరంలో విద్యార్థులు:	28954
2018-19 విద్యా సంవత్సరం విద్యార్థులు:	28906

అప్పు చేసి ఫీజు కడుతున్నాం



గత ప్రభుత్వంలో కాలేజీలకు ఫీజులు ప్రభుత్వమే చెల్లించేది. ఈ ఏడాది ప్రభు త్వం చెల్లించకపోవడంతో అప్పుచేసి ఫీజులు కడుతున్నాం. ఉన్నత విద్య చదివించాలనుకున్న సాధారణ ప్రజల కు ప్రభుత్వం నిర్ణయంతో ఇబ్బందులు తప్పడం లేదు. – బోర కోటేశ్వరరావు, విద్యార్థి తండ్రి, బోరవానిపేట గార మండలం

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయం

రణస్థలం/ఎచ్చెర్ల: కార్మిక హక్కుల పరిరక్షణకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరిశాంలోని శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమ వద్ద యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో అక్రమంగా సస్పెండ్ చేసిన ఏడుగురు కార్మికులను వెంటనే విధుల్లోనికి తీసుకోవాలని, కార్మిక శాఖ సంయుక్త కమీషనర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.కూర్మారావు, వెంపడాపు లక్ష్మణరావు, ఎం.రమణ, దన్నాన శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు



బయో రిసోర్సు సెంటర్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. తమ్మినాయుడుపేటలోని బయో రిసోర్సు సెంటర్ (ప్రకృతి వ్యవసాయ సహజ వనరుల కేంద్రం)ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విస్తరణ పెరగాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల స్థానంలో కషాయాలు, జీవామృతం వంటివి వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, శోభన్‌బాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైట్ సోదరుల జీవితం స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం అర్బన్ : విమానాన్ని కనిపెట్టిన రైట్ సోదరుల జీవితం స్ఫూర్తిదాయకమని ట్రావెల్ అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్షుడు లయన్ నటుకుల మోహన్ అన్నారు. శ్రీకాకుళంలోని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యాలయంలో రైట్ సోదరులలో ఒకరైన విల్బర్ రైట్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధి బరాటం శ్రీరామ్‌మూర్తి, అసోసియేషన్ సభ్యులు ఉరిటి శ్రీనివాసరావు, కావవరపు సీజు, సదరన్ ట్రావెల్స్ సభ్యులు శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్, నూతన ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.



విల్బర్ రైట్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

కేంద్ర గ్రంథాలయ భవనాలను కాపాడాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన సముదాయం అన్యాక్రాంతం చేసే ప్రతిపాదన విరమించుకోవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడుకు ఫ్యాక్స్ ద్వారా మెసేజ్ పంపించారు. గ్రంథాలయ ఆస్తిని అభివృద్ధి పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం నష్టదాయకమైనదని పేర్కొన్నారు. తక్షణమే భవనాలను కూల్చివేసే ప్రతిపాదనలు, సంబంధిత ఉత్తర్వులు రద్దు చేయాలని కమిటీ కన్వీనర్ కె.వి.సుబ్రహ్మణ్యం, జిల్లా గ్రంథాలయ పెన్షనర్ల సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వైకుంఠరావు, సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు, కొత్తకోట అప్పారావు, ఎస్వి రమణమూర్తి, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు కోరారు.

రేపు వైఎస్సార్ సీపీ సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలోని వెంకటేశ్వర స్వామి గుడి సమీప తోటల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో వచ్చే నెల 4న వెన్నుపోటు దినం ర్యాలీకి సంబంధించి సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలు విస్మరించిన ప్రభుత్వ వైఫల్యంపై ప్రజల్లోకి తీసుకువెళ్లటం లక్ష్యంగా ర్యాలీ సాగుతుందని తెలిపారు.

కమ్ముకున్న కారుమబ్బులు



రోజంతా ఉక్కపోతతో ఇబ్బందిపడిన జనం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఉపశమనం పొందారు. జి.సిగడాం-పాగిరి గ్రామాల పరిధిలో శుక్రవారం సాయంత్రం ఇలా మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. కాసేపు చిరుజల్లులు పడి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊరటచెందారు.

– జి.సిగడాం

రేషన్ డిపోల్లో బోర్డులు తప్పనిసరి



లావేరులో రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ రాజశేఖర్

ఎచ్చెర్ల: లావేరు మండలంలో 58 రేషన్ డిపోల్లోనూ తప్పనిసరిగా సరుకులు, ఇతర వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాల తహశీల్దార్ మంగ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం లావేరు డిపోను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి డిపోల్లోనే సరుకులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. డీలర్లు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, సీనియర్ అసిస్టెంట్ రత్నాకర్, కీర్తి వెంకటరమణ, డీలర్ ఇజ్జు సతిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం ఫ్రాన్స్‌లో అద్భుత ప్రదర్శనతో అలరించారు. అంతర్జాతీయ సమగ్రత వేడుకలలో భాగంగా నాలుగో రోజు శ్రీకాంత్ బృందం పాప్‌అప్ వేదికపై ఫ్యూషన్ (పాశ్చాత్య శాస్త్రీయ) నృత్యం ప్రదర్శించి వీక్షకులను ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలో రామకొండిన్య, అన్నానేహా థామస్, గాయత్రి వర్షిత, నేహా పట్నాయిక్, లలిత, చాందిని పాల్గొన్నారు. ఇటువంటి మంచి అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖకు, ఏపీఈడీపీలకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.



ఫ్యూషన్ నృత్య ప్రదర్శనలో శ్రీకాంత్ శిష్య బృందం

కొత్తకుంకాంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల : లావేరు మండలం కొత్తకుంకాంలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఎంపీడీఓ పి.వెంకట్రాజు గ్రామానికి వెళ్లి దగ్గరుండి శానిటేషన్ పనులు చేయించారు. కాలువలు, వీధులు, చేతిపంపుల వద్ద పూడికలు తీయించారు. క్లోరినేషన్ చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురపాక పీహెచ్‌సీ వైద్యులు జగదీష్, సిబ్బంది మందులు పంపిణీచేశారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.